క్లుప్తంగా

పోలీసు బలగాల కవాతు



చిప్పగిరి: త్వరలో జరగనున్న ఎన్నికల దృష్ట్యా సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం చిప్పగిరిలో మిలటరీ బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కూడలి నుంచి గ్రామంలోని పలు కాలనీలలో కవాతు చేపట్టారు. వారు మాట్లాడుతూ మండలంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గోనెగండ్ల: మండల పరిధిలోని తిప్పనూరు గ్రామంలో బ్రిడ్జి వద్ద హంద్రీ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. వివరాలు.. కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన సాతర్ల రంగస్వామి, బొచ్చు మహేష్ మంగళవారం ఉదయం రెండు ట్రాక్టర్లలో తిప్పనూరు గ్రామం వద్ద హంద్రీ నుంచి కోడుమూరుకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

చిప్పగిరి: హాలహర్వి మండలంలోని టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 45 హమాలీ కుటుంబాల వారు మంగళవారం ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. నాయకులు రామకృష్ణ, శివప్ప, యగ్గిరెడ్డి, చంద్ర, లింగప్ప, తదితరులు ఉన్నారు.

మార్కెట్ వేలంపాట వాయిదా

ఆలూరు రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్ వేలాలు వాయిదా వేస్తున్నట్లు ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు తెలిపారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో వారపు సంత, బస్టాండు, దిన కూరగాయల మార్కెట్ వ్యాపారాలకు వేలంపాట ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ నిర్ణయించిన ధరకు పాటదారులు ముందుకు రాకపోవడంతో వేలంపాట వాయిదా వేస్తున్నట్లు ఈఓపీఆర్డీ ప్రకటించారు. ఉన్నతాధికారులతో చర్చించి తదుపరి వేలం తేదీని ప్రకటిస్తామన్నారు.

ఘనంగా దేవర

నందవరం: మండల కేంద్రంలో వెలసిన బంగారమ్మ దేవి, మారెమ్మవ్వ దేవర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామంలో వెలసిన అమ్మవార్లకు ఆలయ పుజార్లు, భక్తులు అభిషేకాలు, ప్రత్యేకాలంకరణ గావించి పూజలు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు పూలతొట్టి ఊరేగింపు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, బుట్టా ప్రతూల్, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, సర్పంచ్ తోట సావిత్రి, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 6 టీఎంసీలకు తగ్గిన నీరు

హొళగుంద: ఉమ్మడి రిజర్వాయర్ కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో మంగళవారం నీటి నిల్వ 6.5 టీఎంసీలకు తగ్గింది. గత నెల 19న ఎల్లెల్సీకి ఏపీ కోటా నీటిని విడుదల చేసిన టీబీ బోర్డు అధికారులు ఈ నెల 20వ తేదీన సరఫరా నిలిపి వేయనున్నారు. డ్యాంలో మంగళవారం 1584.20 అడుగుల వద్ద నీరు ఉండగా ఇన్‌ఫ్లో జీరో ఉండి అవుట్‌ఫ్లో 2,042 క్యూసెక్కులుంది. ఎల్లెల్సీ ఆంధ్ర పరిధి 250 కి.మీ వద్ద 480 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

దేవరలోగా ఆలయ నిర్మాణం

వెల్దుర్తి(కృష్ణగిరి): రామళ్లకోట గ్రామంలో డిసెంబర్‌లో దేవర జరపాలని తలచామని, ఆలోగా సుంకులమ్మ ఆలయం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు మాధవస్వామినాయుడు, కమిటీ ప్రతినిధులు తెలిపారు. వారు మంగళవారం మాట్లాడుతూ.. ఆలయానికి సమకూరిన నిధులు తన వద్ద నుంచే కమిటీ ప్రతినిధులు ఖర్చు చేస్తుండగా, అదనపు ఖర్చులు తానే భరిస్తూ 50 శాతానికిపైగా పనులు పూర్తి చేశామన్నారు. పనులు పూర్తిచేసి అమ్మవారి ప్రతిష్టానంతరం ఉత్సవాలు, దేవర కలిపి నిర్వహించేలా గ్రామస్తుల సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. ఇంతలో ఒక పత్రిక పనిగట్టుకుని వ్యతిరేక వార్తలు రాయడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాధవస్వామి, వెంకటేశ్వర్లు,బీటీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దూదేకులను దూషిస్తే చర్యలు

దేవనకొండ: దూదేకులను అసభ్య పదజాలంతో దూషిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షులు టోపీ యూసుఫ్‌బాషా తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. దూదేకుల మద్దతు వైఎస్సార్‌సీపీకి ఉంటుందన్నారు.

చేనేతలకు గుర్తింపునిచ్చిన నేత సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక
- ఎమ్మిగనూరులో ఘనంగా చేనేతల ఆత్మీయ సమ్మేళనం



చేనేతల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బుట్టా రేణుక


హాజరైన చేనేతలు

ఎమ్మిగనూరుటౌన్: చేనేతలను ఆర్థికంగా, రాజకీయంగా ఆదుకొని తగిన గుర్తింపునిచ్చిన నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి చేనేతల ఆత్మీయ సమ్మేళనంలో చేనేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేత పని లేక చితికిన చేనేతలకు సీఎం వైఎస్ జగన్ నేతన్న నేస్తం పథకం అందించడంతో ఈ ఐదేళ్లలో నేత వృత్తికి పూర్వవైభవం వచ్చినట్లయ్యిందన్నారు. పద్మశ్రీ మాచాని సోమప్ప హయంలో చేనేత రంగం ఎంతో అభ్యున్నతి సాధించిందని, తరువాతి కాలంలో కుదేలైందన్నారు. ఆయన నాడు ఏర్పాటు చేసిన అనేక సంస్థలు నేటికీ కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. కుటుంబం మొత్తం కష్టపడితే గానీ పూటగడవని స్థితిలో ఉన్న నేత కార్మిక కుటుంబాలకు సీఎం జగనన్న నేతన్న నేస్తం కింద ఏటా రూ.24 వేలు మంజూరు చేయడంతో ఆ కుటుంబాలు బాగుపడుతున్నాయన్నారు. చేనేత హక్కులను సాధించుకోవాలంటే రాజ్యాధికారం కావాలని, ప్రస్తుతం అవకాశం వచ్చిందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే అన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు మూతపడిన పరిశ్రమలు తెరిపించి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. బీసీలకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీతో పాటు పలు ఎమ్మెల్యే సీట్లు కేటాయించారన్నారు. మాచాని సోమప్ప మార్గంలో పయనిస్తానని, చేనేతలను విడగొట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని అలాంటివి పట్టించుకోక సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమెను, భర్త బుట్టా నీలకంఠను కురినికుల సంఘ పెద్దలు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, యువ నాయకుడు ప్రతూల్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండా ఆనంద్‌ప్రసాద్, కుర్నికరికల కార్పొరేషన్ చైర్మన్ బుట్టాశారదమ్మ, శాప్‌నెట్ వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, కుర్ని సంక్షేమసంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.శ్రీనివాసులు, చేనేత నాయకులు విరూపాక్షప్ప, డాక్టర్ శిల్ప, పీజీకే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


చేనేత కార్మికులకు పరికరాలను అందజేస్తున్న డీపీఎం రేఖరెడ్డి

నందవరం: ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందించే పథకాలు, పరికరాలను వినియోగించుకుని పొదుపు మహిళలు, చేనేత కార్మికులు ఆర్థికంగా బలోపేతం కావాలని రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రేఖరెడ్డి, ఆర్డిఫ్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర ప్రతాప్ సూచించారు. మంగళవారం నాగలదిన్నె గ్రామ సచివాలయంలో డీఆర్‌డీఏ, రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిఫ్ సంస్థల ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు పరికరాలను ఆ సంస్థల మేనేజర్లు పంపిణీ చేశారు. పొదుపు మహిళలకు జీవనోపాధిపై శిక్షణ ఇచ్చారు. గ్రామంలో 25 మందికిగాను 13 మందికి మగ్గాలు తదితర పరికరాలను అందజేశారు. మిగతా వారికి రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. ఎంపీటీసీ అత్తవుల్లా, వైకేపీ సీసీ జనార్ధన్, ఈడబ్ల్యూ ఉసేని, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం


వెల్దుర్తి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులను స్విచాన్ చేసి ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి రైల్వేస్టేషన్‌లో రూ.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. స్టేషన్ రెండో ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ పాల్గొని స్విచాన్ చేసి అభివృద్ధి పనుల బోర్డును ఆవిష్కరించారు. హైదారాబాద్ డివిజన్ ఏఓఎం రితీష్, కర్నూలు ఏడీఈఎన్ నాగేశ్వరరావు, స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటయ్య మాట్లాడుతూ.. స్టేషన్‌లో రూ.50 లక్షలతో హమాలీ రూమ్, అప్రోచింగ్ రోడ్ తదితర పనులు చేపట్టినట్లు తెలిపారు. రైల్వే శాఖ, ఆర్‌పీఎఫ్, బీజేపీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు పరీక్షా కేంద్రాల ఏర్పాటు

తుగ్గలి: ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ-2 రామవెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. మండలంలోని 7 జెడ్పీహెచ్ఎస్, ఏటీడబ్ల్యూఆర్, ఆశ్రమ, కేజీబీవీ, మద్దికెర మండలం పెరవలి జెడ్పీహెచ్ఎస్, తుగ్గలి నోవీ కాన్సెప్ట్ స్కూల్ నుంచి మొత్తం 601 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. వీరిలో సప్లిమెంటరీ 58 మంది ఉన్నట్లు తెలిపారు. జొన్నగిరి, పెండేకల్లు రైల్వే జంక్షన్, తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాల, తుగ్గలి నోవీ కాన్సెప్ట్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించినట్లు ఆయన తెలిపారు. పదో తరగతి సెట్-2 ప్రశ్నాపత్రాలను తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచామన్నారు.

అక్కాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి చేయూత


మెగా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


చేయూత చెక్కును లబ్ధిదారులకు అందచేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సమన్వయకర్త బుట్టా రేణుక

మద్దికెర: మండలంలో వైఎస్సార్ చేయూత పథకం 4వ విడత కింద 2294 మంది సభ్యులకు మంజూరైన రూ.4.30 కోట్ల మెగా చెక్కును మంగళవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి లబ్ధిదారులకు అందజేశారు. ముందుగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉదయం 11 గంటలకు ప్రధాన బజారులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించి పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే రూ.18.50 లక్షలతో కూరగాయల మార్కెట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. స్థానిక పొదుపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం ద్వారా 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల ఉన్న మహిళలకు సంవత్సరానికి రూ.18750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు అందించారని వివరించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ, జనసేన మోసపూరిత వాగ్దానాలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని, గతంలో 14 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడే ఏమీ చేయలేకపోయారని, ఇప్పుడేం చేస్తారని ప్రశ్నించారు. జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, విజయుడు, నాయకులు ఖాజావలి, వైకేపీ ఏపీఎం మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలను నమ్మి మోసపోవద్దు

ఎమ్మిగనూరురూరల్: ప్రతిపక్షనాయకుడు చంద్రబాబునాయుడు ఎన్నికల్లో గెలవాలనే లక్ష్యంతో అలవిగాని హామీలను ప్రకటిస్తున్నాడని, నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వైఎస్సార్ చేయూత చెక్కు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న ఇచ్చిన మాట ప్రకారం పొదుపు మహిళలకు రుణమాఫీ చేశారని, చేయూత పథకం కింద లబ్ధిదారురాలకు నాలుగేళ్లలో రూ.75 వేలు అందించినట్లు వివరించారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వకర్త బుట్టా రేణుక పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత కింద నాలుగు విడతల్లో మండలానికి మొత్తం రూ.30.11 కోట్లు అందించారని వివరించారు. ప్రభుత్వ సాయం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమవుతుందని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.


దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్.బసిరెడ్డి, ఎంపీపీ గొల్ల కేశన్న, బుట్టా నీలకంఠ, డీఈ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ కొండన్న, ఏపీఎం శ్రీనివాసులు, వెలుగు సిబ్బంది, మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోసకారి చంద్రబాబును నమ్మొద్దు

తుగ్గలి: అధికారం కోసం మహిళలకు అనేక హామీలిచ్చి గద్దెనెక్కాక నిలువునా మోసగించిన చంద్రబాబు నమ్మవద్దని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో మంగళవారం వైఎస్సార్ చేయూత సంబరాలు నిర్వహించారు. మండలంలో చేయూత నాలుగో విడతగా 3,681 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7.24 కోట్ల మెగా చెక్కును వారికి అందజేశారు. నాలుగు విడతల్లో అక్కచెల్లెమ్మలకు రూ.30 కోట్ల మేర అందించినట్లు స్పష్టం చేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, సుధాకరరెడ్డి, రామచంద్రారెడ్డి, టీఎండీ హుసేన్, మధు, చాంద్‌బాషా, నాగరాజు, వైకేపీ ఏపీఎం రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు మిషన్‌తో స్వయం ఉపాధి



రాష్ట్ర ప్రభుత్వం అందించిన చేయూత పథకం సాయంతో కుట్టుమిషన్ తెచ్చుకొని స్వయం ఉపాధి పొందుతున్నాను. ఇంట్లోనే ఉంటూ పనులు చేసుకుంటున్నాను. మంచిగా ఆదాయం వస్తుంది. మరింత మందికి శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాను.

– జహీరాబీ, హంప, మద్దికెర మండలం

చీరల వ్యాపారం చేస్తున్నా



చేయూత పథకం ద్వారా వచ్చిన నగదుతో పాటు మరికొంత కలుపుకుని చీరల వ్యాపారం ప్రారంభించాను. అలాగే కుట్టు మిషన్ తెచ్చుకుని ఉపాధి పొందుతున్నాను. గత నాలుగేళ్లుగా చేయూత పథకం ద్వారా రూ.75 వేలు వచ్చింది. జగనన్న అందించిన సాయం ఎంతో ఉపయోగపడింది.

– రంగనాయకమ్మ, మద్దికెర.

సచివాలయాలతో సత్ఫలితాలు

ఆలూరు రూరల్: సచివాలయ వ్యవస్థతో సత్ఫలితాలు వస్తున్నాయని, గ్రామాభ్యుదయానికి రాచబాటలుగా సచివాలయాలు మారాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి అన్నారు. హత్తిబెళగల్‌లో రూ.45 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాన్ని ఆయన మంగళవారం గ్రామ సర్పంచ్ శేఖన్ బీతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు, పథకాలు సకాలంలో అందుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో హత్తిబెళగల్ సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా 6,671 మంది లబ్ధిదారులకు డీబీటీ కింద రూ.19,96,45,568 అందాయన్నారు. నాన్ డీబీటీ ద్వారా 2,049 మంది లబ్ధిదారులకు రూ.9,85,99,302 కోట్లు లబ్ధి చేకూరిందని వివరించారు. అనంతరం గ్రామంలో పోతప్ప కట్ట నుంచి కురువ కాలనీకి వెళ్లే రహదారి, మకాన్ సాహెబ్ మసీదు రహదారిలో ఎంపీపీ నిధులు రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు భూమి పూజ చేశారు. ఎంపీటీసీ యమునప్ప మండల కన్వీనర్ ఈరన్న, కో-కన్వీనర్ వీరేష్, చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య తదితరులు ఉన్నారు.


హత్తిబెళగల్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న విరూపాక్షి

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో మారెమ్మవ్వ ఆలయం నుంచి ఎస్సీ కాలనీ, వడ్డే కాలనీల్లో నీటి సమస్య పరిష్కారానికి మినీ ట్యాంకు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ గోపాల్ విన్నవించగా త్వరలోనే మినీ ట్యాంకులను నిర్మిస్తామని విరూపాక్షి హామీ ఇచ్చారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నాపత్రాలు

కృష్ణగిరి: ఈ నెల 18న ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. వీటిని రూట్ అధికారి తిమ్మారెడ్డి పోలీస్ బందోబస్తుతో తీసుకొచ్చి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. మండలంలోని కంబాలపాడులో రెండు, కృష్ణగిరిలో ఒక పరీక్షా కేంద్రానికి సంబంధించి సెట్-1, సెట్-2 పేపర్లు వచ్చాయని ఆయన తెలిపారు. వీటిని ఆయా సెంటర్ల ఛీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులు జంబులన్న, సుజాత, వెంకటేశ్వర్లు, ప్రసాద్, రమేష్, దినకర్‌నాయుడు సమక్షంలో అప్పగించడం జరిగిందని ఆయన వెల్లడించారు. మండలంలో కంబాలపాడు జిల్లా పరిషత్ సెంటర్‌లో 156 మంది, కంబాలపాడు గురుకుల బాలికల విద్యాలయం సెంటర్‌లో 220 మంది, కృష్ణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 253 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి


చందోలిలో సీసీరోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: వైఎస్సార్‌సీపీ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. చందోలి గ్రామంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20.84 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.15 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, డ్రైయిన్‌లను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మంగళవారం ప్రారంభించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు బింగి రామన్నకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ నారాయణదాస్, నాయకులు పక్కీరప్ప, సోమశేఖర్, రహిమాన్, పూరి శ్రీరాములు, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

పత్తికొండలో బుధవారం ఊరిదేవర మహోత్సవం సందర్భంగా అంకాలమ్మ, బంగారమ్మలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్శించుకుని పూజలు జరిపించారు. దేవర మహోత్సవాన్ని ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆమె సూచించారు.

ప్రజల్లోంచి పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ


ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బెడ్ పంపిణీ చేస్తున్న విరూపాక్షి


తుగ్గలిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఎమ్మిగనూరు ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న బుట్టా రేణుక, ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు చేరువైన వైఎస్సార్‌సీపీ ప్రజల్లో గుండెల్లో చోటు సంపాదించుకుందని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ శ్రేణులతో కలిసి కేక్‌కట్ చేసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. పార్టీ నాయకులు కేఎస్ రఘు, మాచాని వెంకటేష్, బీఆర్ బసిరెడ్డి, బుట్టారంగయ్య, కేశన్న, నజీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: కురువెళ్లి గ్రామంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి, జెడ్పీటీసీ ఏరూరుశేఖర్, మండల కన్వీనర్ ఈరన్న ఆధ్వర్యంలో వైఎస్సార్ పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేశారు.వైస్ ఎంపీపీలు శ్రీరాములు, నాగవేణి, నాయకులు హనుమంతమ్మ, బోయ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో యూత్ అధ్యక్షుడు బందెనవాజ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

తుగ్గలి: మండలంలో పార్టీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ గెలుపు వైఎస్సార్‌సీపీదేనని ధీమా వ్యక్తం చేశారు.

దేవనకొండ: మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు జై వైఎస్సార్ అంటూ నినాదాలు చేస్తూ బస్టాండ్ వద్దకు చేరుకుని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలకేంద్రంలో నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ నాయకులు గంగాధర మాట్లాడారు. సీనియర్ నాయకులు డాక్టర్ కృష్ణ, రామకృష్ణ, దర్గప్ప, అన్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: ఆస్పరిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ దొరబాబు, రాఘవేంద్ర, గోవర్ధన తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: మండల కేంద్రంతో పాటు ఎల్లార్తి తదితర గ్రామాలలో నాయకులు ఈశా, కోగిలతోట శేషప్ప, ఎంపీటీసీ మల్లికార్జున తదితరుల ఆధ్వర్యంలో కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఎల్లార్తిలో సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో దర్గాలో ఉంటున్న అనాథలు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

‘ఉపాధి’ సద్వినియోగం చేసుకోండి


తిప్పనూరులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్నాథ రెడ్డి

గోనెగండ్ల: జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ అమర్నాథ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని తిప్పనూరు గ్రామంలో కాలువలో పూడికతీత పనులను మంగళవారం డ్వామా పీడీ పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి రోజూ ఎంతమంది పనికి వస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. నిర్దేశిత కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు రూ.272 కూలీ వస్తుందని తెలిపారు. వేసవి ఎండల దృష్ట్యా ఉదయం త్వరగా పనులకు వెళ్లి 11 గంటల్లోపు ఇంటికి వెళ్లిపోవాలన్నారు. రోజువారీ కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. 5 ఎకరాలలోపు పొలం కలిగిన సన్నకారు రైతులకు పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం మొక్కలను వంద శాతం ఉచితంగా ఇస్తుందని తెలిపారు. అలాగే మొక్కల పెంపకానికి కూడా ప్రభుత్వమే నిధులు అందిస్తుందని చెప్పారు. పండ్ల తోటలు సాగుచేసుకుంటే మంచి లాభాలు వస్తాయని తెలిపారు. ఏపీఓ మహమ్మద్ బాషా, ఈసీ ఉస్మాన్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కార్యాలయాల ప్రారంభోత్సవం

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయంతోపాటు ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ, జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కొళాయి పనులను బుధవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్ తెలిపారు. ఈ ఐదు పనులను రూ.1.43 కోట్లతో చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమానికి అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు కోరారు. అలాగే మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ చేయూత కింద మండలంలో 2,475 మంది మహిళలకు మంజూరైన రూ.4.64 కోట్ల మెగా చెక్కును అందించడం జరుగుతుందని, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీఎం మహేశ్వరయ్య కోరారు.